www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 28 జూన్ 2024



అపార్ట్‌మెంట్‌లో అగ్ని ప్రమాదం

ప్రజాశక్తి - రాయచోటి

పట్టణంలోని ఇంజినీరింగ్ కళాశాల సమీపం ఉన్న విజయ్ కేతన అపార్ట్‌మెంట్‌లో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. గురువారం ఉదయం 11:20 గంటలకు షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం సంభవించింది. స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు హుటాహుటిగా వచ్చి అపార్ట్‌మెంట్‌లో హై కాన్సెంట్రేషన్‌లో ఉన్న హోమ్ ద్రవాన్ని వినియోగించి ఫైర్ విస్తరించకుండా మంటలను ఆర్పి వేశారు. ఇందులో రెండు కార్లలో ఒకటి పూర్తిగా, మరొకటి పాక్షికంగా కాలిపోయాయి. రెండు స్కూటర్లు పాక్షికంగా కాలాయి. వాటి విలువ సుమారుగా రూ. 6 లక్షల వరకు ఉంటుందని వాటి యజమానులు పేర్కొన్నారు. చుట్టుపక్కల ఎలాంటి ఆస్తి నష్టం సంభవించకుండా కాపాడమని రాయచోటి అగ్నిమాపక అధికారి ఎం. వెంకటరామిరెడ్డి తెలిపారు.


మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

సురక్షిత ప్రయాణమే ఆర్‌టిసి లక్ష్యం

- త్వరలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం
- రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి-రాయచోటి

ప్రయాణికులను సురక్షితంగా గమ్యం చేర్చడమే ఆర్‌టిసి ముఖ్య ఉద్దేశమని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖా మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం రాయచోటి ఆర్‌టిసి బస్టాండ్‌లో రాయచోటి నుంచి తిరుపతికి నూతన సూపర్ లగ్జరీ బస్సును మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికులను సురక్షితంగా గమ్యం చేర్చడమే ఆర్‌టిసి ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ప్రయాణికుల కోసం మరిన్ని నూతన బస్సులు ప్రారంభిస్తామన్నారు. రాబోయే రోజులలో రాయచోటి పట్టణాభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని నూతన బస్సులు కొనుగోలు చేసి ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూస్తామని పేర్కొన్నారు. త్వరలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. రాయచోటి డిపో నుంచి మొదటిసారిగా రాయచోటి నుంచి తిరుపతికి సూపర్ లగ్జరీ సర్వీసులు ప్రారంభించడం ఇదే మొదటిసారన్నారు. ఈ బస్సు ఉదయం రాయచోటి నుంచి 7.30 గంటలకు బయలుదేరి 10.30 గంటలకు తిరుపతి చేరుకుంటుందన్నారు. ఉదయం11 గంటలకు తిరుపతి నుంచి బయలుదేరి 2.00 గంటలకు రాయచోటి చేరుకుంటుందన్నారు. మధ్యాహ్నం 2.30 గంటలకు రాయచోటి నుంచి బయలుదేరి సాయంత్రం 5.30 గంటలకు తిరుపతి చేరుకుంటుందని తెలిపారు. రాత్రి 6.00 గంటలకు తిరుపతి నుంచి బయలుదేరి రాత్రి 9.00 గంటలకు రాయచోటి చేరుకుంటుందన్నారు. రాయచోటి బస్టాండ్‌ను మంత్రి రాంప్రసాద్‌రెడ్డి సందర్శించి ఆర్‌టిసి ఉద్యోగులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో కడప జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకటేశ్వరరావు, జిల్లా ప్రధాన రవాణా అధికారి రాము, రాయచోటి డిపో మేనేజర్ ధనుంజయ, ఆర్‌టిసి ఉద్యోగులు పాల్గొన్నారు.


బస్సు సర్వీసును ప్రారంభిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

నామినేటెడ్ ఆశలు!

- రాష్ట్ర కేంద్రం నుంచి అర్హులకు ఫోన్లు
- బయోడేటా, ఇన్‌ఛార్జి లెటర్లు అందజేతకు ఆదేశాలు
- ఇన్‌ఛార్జుల దగ్గర ద్వితీయశ్రేణి నాయకుల విజ్ఞప్తులు
- గ్రూపుల వారీగా జాబితాల తయారీలో నిమగ్నం

జిల్లాలో నామినేటెడ్ పోస్టులపై ఆశలు ఊపందుకున్నాయి. ఇటీవల ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు త్వరలో నామినేటెడ్ పోస్టులు భర్తీ చేస్తామని ప్రకటించడం తెలిసిందే. ఇందుకు అనుగుణంగానే రాష్ట్ర టిడిపి కార్యాలయం నుంచి కొంతమంది అర్హులైన నాయకులు, కార్యకర్తలకు ఫోన్లు చేసి అర్హత సంబంధిత సమాచారాన్ని కోరుతోంది. ఆశావహుల్లో ఉత్సాహం నెలకొంది. ఆశావహుల బయోడేటాతోపాటు ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జి లెటర్లు అందజేయాలని కోరుతుండడం ఆశలు రేపుతోంది. పార్టీకి అందించిన సేవలు, పార్టీ అప్పగించిన బాధ్యతల నిర్వహణ, ఇతర కార్యకలాపాల వివరాలను అందజేయాల్సి ఉన్నట్లు తెలుస్తోంది. పలువురు నాయకులు, సీనియర్ కార్యకర్తలు ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జిల దగ్గరికి పరుగులు తీస్తున్నారు. ఈ సారైనా తమకు నామినేటెడ్ పదవులు లభించే విధంగా సిఫారసు చేయాలని పార్టీ నియోజకవర్గ, జిల్లా నాయకత్వాలను కోరుతున్నారు.

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

కడప, అన్నమయ్య జిల్లాలో 13 అసెంబ్లీ, రెండు పార్లమెంట్ స్థానాలు ఉన్నాయి. పులివెందుల, బద్వేల్, రాజంపేట, తంబళ్లపల్లి మినహా మిగిలిన తొమ్మిదింట్లో ఏడు టిడిపి, ఒకటి చొప్పున జనసేన, బిజెపి గెలుకున్న సంగతి తెలిసిందే. ఉమ్మడి జిల్లాలో నలుగురు తొలిసారి ఎమ్మెల్యేలుగా గెలుపొందారు. పాత, కొత్త నేతలు తమ నియోజకవర్గాల్లో పదవులు దక్కించుకునేందుకు పావులు కదుపుతున్నారు. పార్టీ కోసం పని చేసిన వారికి నామినేటెడ్ పదవులను కేటాయించాలని కోరుతున్నారు. గత ఐదేళ్లలో పార్టీకి చేసిన సేవలు, పార్టీ పిలుపునిచ్చిన కార్యక్రమాల నిర్వహణ, వైసిపి హయాంలో ఇబ్బందులు పడ్డ తీరును ఏకరువు పెడుతున్నారు. ఇటువంటి కేడర్‌ను అర్హులుగా గుర్తించి పదవులు పంపిణీ చేయాలని కోరుతున్నారు. టిడిపిలో బహు నాయకత్వం ఎక్కువగా ఉన్న సంగతి తెలిసిందే. 2024 సార్వత్రిక ఎన్నికల్లో సమిష్టిగా పనిచేయడం ద్వారానే గెలుపు సాధ్యమైంది. ఇందుకు అనుగుణంగా గ్రూపుల వారీగా జాబితాలను వేర్వేరుగా తయారు చేస్తున్నారు.



వైసిపి హయాంలో నామినేటెడ్ పదవుల భర్తీలో జిల్లాకు పెద్ద ఎత్తున ప్రాధాన్యత లభించింది. రాష్ట్ర స్థాయి చైర్మన్ పోస్టులు మొదలుకుని వివిధ శాఖలు, సంస్థల్లో డైరెక్టర్ పదవుల వరకు దక్కాయి. టిడిపి నాయకత్వం వైసిపి తరహాలోనే నామినేటెడ్ పదవుల పందేరానికి శ్రీకారం చుట్టినట్లు తెలుస్తోంది. కూటమి సర్కారు ఏర్పడిన నెల రోజుల వ్యవధిలోనే నామినేటెడ్ పోస్టుల పందేరానికి శ్రీకారం చుట్టింది. 2014-2019 టిడిపి ప్రభుత్వ హయాంలో నామినేటెడ్ పదవుల భర్తీ అనే మాటే మరిచిపోవడంతో కేడర్‌లో తీవ్ర అసంతృప్తి నెలకొన్న సంగతి తెలిసిందే. 2024-2029 పీరియడ్‌లో గతానికి భిన్నంగా నామినేటెడ్ పోస్టులను భర్తీ చేపట్టే దిశగా కదులుతోంది. వైసిపి హయాంలో నామినేటెడ్ పదవులు పొందిన పలువురు కార్పొరేషన్ చైర్మన్లు, వివిధ శాఖల, సంస్థల డైరెక్టర్లు వరుసగా రాజీనామాలు చేస్తున్నారు. వీరి స్థానాల్లో టిడిపి సీనియర్ నాయకులు, సీరియస్ కార్యకర్తలకు నామినేటెడ్ పదవులు కట్టబెట్టే దిశగా కదులుతుండడం ఆశలు రేపుతోంది.

'సంపూర్ణత అభయాన్'ను పటిష్టంగా నిర్వహించాలి

- కలెక్టర్ ఎం.అభిషిక్త్ కిషోర్


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ అభిషిక్త్ కిషోర్

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

కేంద్ర ప్రభుత్వ నీతి ఆయోగ్ సంస్థ ఆదేశాల మేరకు జులై 4న జిల్లాలో సంపూర్ణత అభయాన్ కార్యక్రమాన్ని పటిష్టంగా నిర్వహించాలని కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిషోర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం రాయచోటి కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాలులో ఆస్పిరేషనల్ బ్లాక్స్ ప్రోగ్రాం కింద జిల్లాలో సంపూర్ణత అభయాన్ కార్యక్రమం అమలు, సాధించాల్సిన లక్ష్యాలు, చేపట్టాల్సిన చర్యలు తదితర అంశాలపై వైద్యఆరోగ్య, మహిళా శిశు సంక్షేమం, వ్యవసాయ, డిఆర్‌డిఎ, ప్రణాళిక అధికారులతో ఆయన సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నీతి ఆయోగ్ సంస్థ నిర్దేశించిన ఇండికేటర్లు ప్రసవానంతర సంరక్షణ కోసం నమోదు చేసుకున్న గర్భిణీ స్త్రీల శాతం, అమలు చేస్తున్న కార్యక్రమాలు, రక్తపోటు, మధుమేహ సంబంధిత వ్యక్తుల స్క్రీనింగ్ శాతం, ఐసిడిఎస్ కార్యక్రమం కింద న్యూట్రిషన్ సప్లిమెంట్ పొందుతున్న గర్భిణుల శాతం, మట్టి నమూనా సేకరణ లక్ష్యంలో జారీ చేయబడిన నేల ఆరోగ్య కార్డుల శాతం, అలాగే రివాల్వింగ్ ఫండ్ కలిగిన స్వయం సహాయక సంఘాల శాతం లపై వైద్యారోగ్య, ఐసిడిఎస్, వ్యవసాయ, డిఆర్‌డిఎ శాఖల అధికారులతో సమీక్షించి పలు అంశాలలో తీసుకోవాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు. భారత ప్రభుత్వం నీతి ఆయోగ్ ద్వారా చేపట్టిన ఆస్పిరేషనల్ బ్లాక్స్ ప్రోగ్రాం కింద అన్నమయ్య జిల్లాలో కోడూరు, కురబలకోట, లక్కిరెడ్డిపల్లి మండలాలు ఎంపికయ్యాయని తెలిపారు. సంపూర్ణత అభయాన్ కార్యక్రమం కింద నీతి ఆయోగ్ ఎంపిక చేసిన ఆరు ఇండికేటర్స్‌లకు సంబంధించి నూరు శాతం పురోగతి సాధించడానికి జూన్, జులై, ఆగస్టు నెలలకు సంబంధించి కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలన్నారు. వెనుకబడిన జిల్లాను ఆయా ఇండికేటర్ల అమలు ద్వారా అభివృద్ధిలోకి తీసుకెళ్లడానికి ఇది ఒక మంచి అవకాశం అన్నారు. జిల్లాలో కార్యక్రమం ద్వారా చేపట్టే నిర్దేశించిన ఇండికేటర్లలో చిత్తశుద్ధితో నూరు శాతం ఫలితాలు సాధించాలన్నారు. అనంతరం వాటిని జిల్లా వ్యాప్తంగా అమలు చేసుకోగలుగుతామని పేర్కొన్నారు. ఆయా మండలాలలోని బ్లాక్ లలో ఈ కార్యక్రమం పట్ల ప్రజలలో విస్తృత అవగాహన కల్పించాలని, అలాగే క్షేత్రస్థాయిలో ప్రజా ప్రతినిధులు, అధికారులు. ప్రజలు భాగస్వాములై కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు. ఇందుకు ఆయా బ్లాకుల వారీగా పంచాయితీ, మండల స్థాయిలో ఒక యాక్షన్ ప్లాన్‌ను రూపొందించుకోవాలని సూచించారు. అధికారుల మధ్య సమన్వయం ఎంతో ముఖ్యం అని పంచాయితీ, మండల స్థాయిలో సమన్వయ సమావేశాలు నిర్వహించి కార్యక్రమం అమలు పట్ల అవగాహన పెంపొందించాలన్నారు. ఆయా అంశాలలో వెనుకబడిన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టి అనుకున్న లక్ష్యాలను సాధించేలా అధికారులు కృషి చేయాలని తెలిపారు. ఫలితాలపై స్పష్టమైన కచ్చితమైన డేటా రూపొందించి ఎప్పటికప్పుడు డేటాను ప్రభుత్వానికి ఆన్‌లైన్ ద్వారా నివేదించాలన్నారు. కార్యక్రమం అమలుకు పంచాయతీ, మండల స్థాయిలలో నోడల్ అధికారులను ఏర్పాటు చేస్తామని, వారు కార్యక్రమాలను ఎప్పటికప్పుడూ పర్యవేక్షించి నిర్దేశిత లక్ష్యాలను సాధించేలా బాధ్యతగా పనిచేయాలని పేర్కొన్నారు. సంపూర్ణత అభియాన్ పథకాన్ని జిల్లాలో విజయవంతంగా నిర్వహించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని పేర్కొన్నారు. అనంతరం వివిధ అంశాలలో పలు సూచనలు జారీ చేశారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, సంబంధిత జిల్లా అధికారులు, మూడు మండలాలకు సంబంధించిన అధికారులు పాల్గొన్నారు.


మృతిచెందిన వృద్ధ దంపతులు నాగమ్మ, నాగసుబ్బన్న

దారుణం

ఆస్తికోసం తల్లిదండ్రులను కడతేర్చిన కసాయి కొడుకు, కోడలు

విషద్రావణం ఇచ్చి దారుణానికి ఒడిగట్టిన వైనం

ప్రజాశక్తి-వీరబల్లి

బిడ్డలను అల్లారు ముద్దుగా పెంచి పెద్ద చేసి వారికి మంచి భవిష్యత్‌ను చూపించిన తల్లిదండ్రులకు చివరకు విషాదమే మిగలింది. ఆస్తి కోసం వృద్ధ తల్లిదండ్రులనే కడ తేర్చారు కుమారుడు, కోడలు. తమ ఆస్తిలో సగం మృతిచెందిన పెద్దకుమారుడు పిల్లలకు రాయిస్తానన్న పాపానికి దారుణానికి ఒడిగట్టారు. విషద్రావణం వారిచే బలవంతంగా తాపించి చంపారు. ఈ హృదయ విషాదకర ఘటన అన్నమయ్య జిల్లా వీరబల్లి మండలం గుర్రప్పగారిపల్లె పంచాయతీ కొత్త వడ్డేపల్లిలో గురువారం చోటు చేసుకుంది. ఈ సంఘటన మండలంలో కలకలం రేపింది. బంధువుల, స్థానికుల, పోలీసుల, కథనం మేరకు... కొత్తవడ్డేపల్లికి చెందిన ఉప్పు తోళ్ల చిన్న నాగ సుబ్బన్న (79) ఉప్పు తోళ్ల నాగమ్మ (75)కు ఇద్దరు కుమారులు, వీరిలో పెద్ద కుమారుడు, భార్య ఇద్దరు మృతిచెందారు. వారికి ఇద్దరు సంతానం. ప్రస్తుతం వృద్ధ తల్లిదండ్రులు చిన్న కుమారుడు ఉప్పుతోళ్ల రమణయ్య, కోడలు కళావతి వద్ద ఉంటున్నారు. వీరి మధ్య తరచూ ఆస్తి గొడవులు జరుగుతూ ఉండేవి. పెద్ద కుమారుడు పిల్లలకు తనకున్న 10 ఎకరాలలో సగం రాసి ఇస్తానని తల్లిదండ్రులు చెప్పారు. దాంతో వారిపై ఆగ్రహించిన చిన్న కుమారుడు రమణయ్య, కళావతిలు ఇరువురు కలిసి గురువారం ఉదయం ముష్టి చెక్క బెల్లం నూరి వారిని తినేలా చేశారు. అది తిన్న నాగ సుబ్బన్న, నాగమ్మలు ప్రాణాపాయ స్థితిలో ఉండగా 108 వాహనానికి సమాచారం ఇచ్చి రాయచోటి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ముందుగా నాగమ్మ మృతి చెందారు. అనంతరం చిన్న నాగ సుబ్బన్న కూడా మృతి చెందారు. మృతికి కారణం చిన్న కుమారుడు, కోడలేనని పోలీసుల ఎదుట వాపోయారు. ఇరువురు వృద్ధులు కావడం, ఒకేసారి మృతి చెందడంతో వారి బంధువులు, స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని కన్నీ మున్నీరు రోధించారు. వృద్ధుల మృతికి కారుకులైన రమణయ్యను, కళావతిని శిక్షించాలని కోరారు. ఈ విషయమై సిఐ తులసి రామ్, ఎఎస్ఐ వెంకటేశ్వర్లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.


డయేరియాపై అవగాహన కల్పిస్తున్న పంచాయతీ ఇఒ ఉదయ్ కుమార్

డయేరియా ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి-వాల్మీకిపురం

మండలంలో డయేరియా ఉన్న ప్రాంతాల్లో అధికారులు ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించారు. 'డయేరియా రోగులతో కిక్కిరిసిన ప్రభుత్వాస్పత్రి' అనే శీర్షికతో శుక్రవారం ప్రజాశక్తిలో కథనం ప్రచురితమైంది. ఈ వార్తకు పంచాయతీ ఇఒ ఉదయ్ కుమార్ స్పందించారు. పట్టణంతో పాటు గొల్లపల్లి, పునుగుపల్లి ప్రాంతాల్లో నీటి ట్యాంకులు, మురికి కాలువలు శుభ్రం చేయించి, బ్లీచింగ్, ఫినాయిల్ స్ప్రే, క్లోరినేషన్ చేయించారు. నరిగిమడుగు పిహెచ్‌సి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించి, డయేరియాపై అవగాహన కల్పించారు. వర్షాభావ పరిస్థితుల వలన కొత్త నీరు కలుషితమవుతున్నాయని, నీటిని కాచి చలార్చుకొని తాగాలని, మలవిసర్జనకు మరుగుదొడ్లు ఉపయోగించుకోవాలని, చేతులు శుభ్రత పాటించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, తాగునీటి వనరులు కలుషితం చేయరాదని వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ వెంకటేష్, ఎంఎల్‌హెచ్‌పి పావని, పంచాయతీ సిబ్బంది, వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైసిపికి జడ్‌పిటిసి పద్మజ రాజీనామా

ప్రజాశక్తి-కలికిరి

వైసిపికి జడ్‌పిటిసి కాకర్ల పద్మజ గురువారం రాజీనామా చేసినట్లు మీడియాకు తెలిపారు. తన రాజీనామా లేఖను అధిష్టానానికి పంపుతున్నట్లు తెలిపారు. తన వ్యక్తిగత కారణాలవల్ల వైసిపి సభ్యత్వానికి రాజీనామా చేస్తు న్నానని చెప్పారు. జడ్‌పిటిసిగా తనను గెలిపించిన ప్రజలకు, సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.


రాజీనామా పత్రాన్ని చూపుతున్న పద్మజ

ఘనంగా బంకిం చంద్ర ఛటర్జీ జయంతి

ప్రజాశక్తి-వాల్మీకిపురం

వందేమాతరం గీత రచయిత బంకిం చంద్ర ఛటర్జీ జయంతి వేడుకలను జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శుక్రవారం మండలంలోని చింతపర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఛటర్జీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జెవివి అధ్యక్షులు ప్రభు చరణ్ మాట్లాడుతూ భారత దేశంలోని గొప్ప కవులు, నవలా రచయితలలో బంకిం చంద్ర ఛటర్జీ ఒకరన్నారు. 1882లో అయన రచించిన ఆనందమట్ నవలలో ఉన్న వందేమాతరం గీతం నేటి భారత జాతీయ గేయమైందన్నారు. స్వతంత్ర సమరంలో యావత్ భారతదేశాన్ని వందేమాతరం ఉర్రుతలూగించిందని, స్వాతంత్ర విప్లవ గీతంగా భారతీయులందరూ గానం చేశారని, బ్రిటిష్ సామ్రాజ్యానికి వ్యతిరేకంగా సింహగర్జనలా ఆ గేయం మారుమోగిందన్నారు. దేశ భక్తికి, స్వాతంత్ర్య పిపాసకు వందేమాతర గీతం ప్రతీకగా నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం రెడ్డెప్ప రెడ్డి, ఉపాధ్యాయులు సువర్ణ, యోగరంజని, యుగంధర్, రమేష్, శ్రీరాములు, దామోదరం, విద్యార్థులు పాల్గొన్నారు.


ఛటర్జీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జెవివి అధ్యక్షులు, ఉపాధ్యాయులు


కంటి వైద్య చికిత్సలు చేసుకుంటున్న ప్రిన్సిపల్ యువరాజ్

విద్యార్థులకు ఉచిత కంటి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-మదనపల్లి

మదనపల్లె ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, సైన్స్‌లో కంటి పరీక్షలను నిర్వహించారు. మదనపల్లెలోని డాక్టర్ అగర్వాల్ కంటి వైద్య హాస్పిటల్ సిబ్బంది కళాశాలలోని అధ్యాపకులు, విద్యార్థులకు ఈ పరీక్షలను నిర్వహించారని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనం ఏపని చేయాలన్నా మన కళ్లు ఆరోగ్యంగా ఉండాలన్నారు. కంప్యూటర్ల ముందు గంటల కొద్దీ కూర్చుని ఉద్యోగాలు చేసే వారికే కంటి సమస్యలు వస్తుంటాయని చాలా మంది భావిస్తారని తెలిపారు. కాలుష్యం, ఆహారపు అలవాట్లు, ఇతర అనారోగ్యాలు కూడా కంటి ఆరోగ్యంపై ప్రత్యక్షంగా ప్రభావం చూపుతాయని పేర్కొన్నారు. ఏడాదికి ఒకసారి కచ్చితంగా కంటి ఆరోగ్యం ఎలా ఉందో చెక్ చేయించుకోవాలన్నారు. మనలో చాలామందికి అసలు ఆ ధ్యాసే ఉండదని చెప్పారు. పెద్ద వ్యాధులు బాగా ముదిరితే తప్ప బయటకు తెలియవన్నారు. పరీక్షల ద్వారా ముందుగానే వీటిని గుర్తిస్తే చెక్ పెట్టే అవకాశం ఉంటుందని తెలిపారు. ఆరోగ్యవంతమైన కళ్ల కోసం రెగ్యులర్ చెకప్ అవసరమన్నారు. పాలకూర, డ్రై ఫ్రూట్స్, నారింజ, చిలగడదుంప, పొద్దుతిరుగుడు విత్తనాలు, క్యారెట్ రసం వంటి ఆహారాల ద్వారా మన కంటికి సంబంధించిన అనేక రకాల వ్యాధులను నయం చేయడంలో సహాయపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ తులసీరామ్ నాయుడు, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ రాజేష్ పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో అధికారుల తనిఖీ

ప్రజాశక్తి - గాలివీడు

మండలంలోని ఎరువులు, పురుగు మందుల దుఖాలను రాయచోటి సాయిల్ కన్జర్వేషన్ ఎడిఎ మణి గురువారం తనిఖీ చేపట్టారు. దుకాణాల్లోని రికార్డులను, మందులను, ఎరువులను పరిశీలించారు. ఆయన వెంట మండల వ్యవసాయ అధికారి ఎం.మురళీధర్ ఉన్నారు.


ఎరువుల గోడౌన్‌లో తనిఖీ చేస్తున్న అధికారులు

నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలి

ప్రజాశక్తి - రాయచోటి టౌన్ : జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్నం భోజనం నాణ్యత పెంచాలని ఆర్ఎస్‌యు జిల్లా ప్రధాన కార్యదర్శి వంశీరెడ్డి అన్నారు. గురువారం రాయచోటిలోని మాసాపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో జిల్లా వ్యాప్తంగా మధ్యాహ్నం భోజనం నాణ్యత పెంచాలని జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో ఉడికి ఉడకని అన్నం, నీళ్ల రసంతో విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. మండల కేంద్రాల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో ఉడకని అన్న, వాసన వస్తున్న గుడ్డు తినడం వలన విద్యార్థులకు కడుపునొప్పి వచ్చి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కొన్ని పాఠశాలల్లో విద్యార్థులు 100 శాతంలో 30శాతం మంది విద్యార్థులు ఇంటి నుంచి క్యారియర్ తెచ్చుకుంటున్నారు. దీనిపైన జిల్లా విద్యాశాఖ అధికారి దృష్టి పెట్టి మధ్యాహ్న భోజనం పథకం కింద వంట చేసే వారి పై చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. లేని పక్షంలో జిల్లా వ్యాప్తంగా విద్యార్థులు అందరినీ ఏకం చేసి విద్యా శాఖ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్ఎస్‌యు నాయ కులు శివరాం. వెంకటరమణ, శివ, మహేష్ పాల్గొన్నారు.


భోజనాన్ని పరిశీలిస్తున్న నాయకులు

పింఛన్ల పంపిణీని పకడ్బందీగా చేపట్టాలి

- కలెక్టర్ ఎం.అభిషిక్త్ కిషోర్

ప్రజాశక్తి - రాయచోటి

పింఛన్ల పంపిణీని పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ పేర్కొన్నారు. వెలగపూడి, ఎపి సచివాలయంలోని సిఎస్ కాన్ఫరెన్స్ హాల్ నుంచి గురువారం పెన్షన్ల పంపిణీ, తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్‌లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ సమీక్ష నిర్వహించారు. రాయచోటి కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టర్ అభిషిక్త్ కిషోర్, డిఆర్‌డిఎ పీడీ సత్యనారాయణ, జిఎస్ డబ్ల్యుఒ ఎఒ లక్ష్మీపతి, తదితర అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పథకం కింద పెన్షన్ల పంపిణీకి కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలన్నారు. పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని సచివాలయ ఉద్యోగులు, ఇతర ఉద్యోగుల ద్వారా పంపిణీ చేస్తారన్నారు. జులై 1ను ఉదయం 6 గంటలకు పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. 50 హౌస్ హోల్డ్‌ల మ్యాపింగ్ చేపటాల్సి ఉందని, శుక్రవారం లోపు వెల్ఫేర్ అసిస్టెంట్ల ద్వారా పెండింగ్ ఉన్న హౌస్ హోల్డ్‌ల మ్యాపింగ్ పూర్తి చేస్తామన్నారు. పెన్షన్ల పంపిణీలో ఎటువంటి సమస్యలు తలెత్తకూడదన్నారు. పెన్షన్ల పంపిణీ అనంతరం లబ్ధిదారుల నుంచి అక్నాలెడ్జ్‌మెంట్ తీసుకోవడం తీసుకోవాలన్నారు. జిల్లాలో పింఛన్ల పంపిణీపై సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని సజావుగా కార్యక్రమాన్ని పూర్తి చేయాలన్నారు. పింఛన్ల పంపిణీ కోసం మండల స్థాయిలో అధికారులంతా అందుబాటులో ఉండి కార్యక్రమం పూర్తి చేయాలన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అభిషిక్త్ కిషోర్


అతిసారపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

అతిసారపై అప్రమత్తంగా ఉండండి

ప్రజాశక్తి-కలికిరి : అతిసారపై అప్రమత్తంగా ఉండాలని హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫీ అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఆదేశాల మేరకు మేడికుర్తి పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ చిన్నరెడ్డెప్ప పర్యవేక్షణలో మండలంలోని రాజువారిపల్లి, సత్యపురం, బోయపల్లిలో అతిసార వ్యాధిపై అవగాహన కల్పించారు. రాజావారిపల్లిలోని మదరసా మసీదులో కూడా విద్యార్థులకు అతిసార, అనీమియా, బిసిజి టీకాపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణంలో మార్పులు వచ్చినందున వర్షాలు పడుట, మామిడి పళ్ల సీజన్ కావడం మరియు పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత లోపించడం వల్ల నీళ్ల విరోచనాలు ప్రబలుతున్నాయని పేర్కొన్నారు. వర్షాకాల పరిస్థితుల వల్ల కొత్త నీళ్ల వినియోగం ఎక్కువ అవుతున్నందున మరుగుదొడ్లు ఉపయోగించుకోవాలని, చేతుల శుభ్రత పాటించాలని, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, తాగునీటి వనరులు కలుషితం చేయరాదని తెలిపారు. అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో, ఆరోగ్య కేంద్రాల్లో ఒఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. పెద్దల బిసిజి టీకాలు ప్రతి సోమవారం, గురువారం ఆరోగ్య కేంద్రాల్లో నిర్దేశించిన ఆరు వర్గాల వారికి వేస్తున్నామన్నారు. రక్తహీనత నివారణకు ప్రతి గురువారం ఐఎఫ్ఎ మాత్రలు అన్ని పాఠశాల విద్యార్థులకు ఇస్తున్నామని తెలిపారు. అనంతరం చేతుల శుభ్రతలోని ఆరు దశలు చేసి చూపించారు. కార్యక్రమంలో వైద్యులు, ఎంఎల్‌హెచ్‌పి నాగరాణి, ఎఎన్ఎంలు నఫీస, పార్వతి, ఆశా కార్యకర్తలు ఆదిలక్ష్మి, చంద్రమ్మ, అంగన్వాడీ కార్యకర్త ఆమని పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులతో పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి-పుల్లంపేట : మండల పరిధిలోని పింఛనుదారులకు జులై ఒకటవ తేదీన సచివాలయ ఉద్యోగులతో పంపిణీ చేయనున్నట్లు ఎంపిడిఒ నరసింహమూర్తి తెలిపారు. గురువారం ఎంపిడిఒ కార్యాలయంలో సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని పింఛనుదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. సచివాలయ ఉద్యోగస్తులే ప్రతి గడపకు వచ్చి అందజేస్తారన్నారు. లబ్ధిదారులకు రూ.ఏడు వేలు అందించనున్నట్లు తెలిపారు. సచివాలయంలో ఉద్యోగుల కొరత ఉంటే అంగన్వాడీ, రెవెన్యూ, ఆరోగ్య సిబ్బందిని ఉపయోగించుకుంటామన్నారు. ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం లోపు పింఛన్లు పంపిణీ చేయాలన్నారు. సచివాలయ ఉద్యోగులు ఒకటో తేదీన సెలవు పెడితే జీతం పెట్టమన్నారు. వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో తహశీల్దార్ వెంకటనారాయణ, డాక్టర్లు సాజీ శేఖర్, మహేష్ కుమార్, ఎ. ఖాన్, ఇఒపిఆర్‌డి పెంచలయ్య, అంగన్వాడీ సూపర్వైజర్లు, రెవెన్యూ, ఆరోగ్య, పంచాయతీరాజ్ సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపిడిఒ నరసింహమూర్తి

క్రైం కార్నర్


పట్టుబడ్డ ఎర్రచందనం దుంగలు, కారుతో అటవీశాఖ నిఘా విభాగం బృందం

ఎర్రచందనం దుంగలు స్వాధీనం

ప్రజాశక్తి-పీలేరు

పీలేరు అటవీ శాఖ నిఘా విభాగం పరిధిలో నిర్వహించిన దాడుల్లో 16 ఎర్రచందనం దుంగలతో సహా కారు స్వాధీనం చేసుకున్నట్లు డిఎఫ్ఒ జెవి సుబ్బారెడ్డి తెలిపారు. బుధవారం రాత్రి తమకు అందిన సమాచారం మేరకు పీలేరు పట్టణం ఎల్లమంద క్రాస్‌లో ఒక బృందాన్ని, చిత్తూరు మార్గంలోని పులిచెర్ల మండలం, జ్యోతి నగర్ వద్ద మరో బృందాన్ని విధుల్లో పెట్టి వాహనాల తనిఖీ నిర్వహించామన్నారు. గురువారం ఉదయం కలకడ వైపు నుంచి వస్తున్న కారును ఆపగా డ్రైవర్ తమను గుర్తించి తన వాహనాన్ని ఆపకుండా వేగంగా ముందుకు దూసుకు దీంతో జ్యోతి నగర్ సమీపంలోని తమ బృందాన్ని అప్రమత్తం చేసి ఆ వాహనానికి ఎదురు రమ్మని ఆదేశించి, అలాగే తాము కూడా ఆ వాహనాన్ని వెంబడించామన్నారు. ఆ కారు డ్రైవర్ ఎదురుగా వస్తున్న తమ సిబ్బందిని చూసి పీలేరు-చిత్తూరు మార్గంలోని ఎంజెఆర్ ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో కారు విడిచి అందులోని డ్రైవర్, మరో ముగ్గురు నిందితులు ఫరారీ అయ్యా రన్నారు. పట్టుబడ్డ ఫియట్ కారు తనిఖీ చేయగా అందులో 439 కిలోల బరువున్న 16 ఎర్రచందనం దుంగలను గుర్తించామన్నారు. వీటి విలువ సుమారు రూ.25 లక్షలు ఉంటుందని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని పేర్కొన్నారు. ఈ దాడుల్లో తనతో పాటు ఎఫ్ఆర్ఒ ఎన్.వెంకట్రమణ, ఎఫ్ఎస్‌పి కె.ప్రతాప్, పీలేరు ఎఫ్‌బిఒ, ఎఫ్ఎస్‌పి, ప్రొటెక్షన్ వాచర్లు జి. నాగేంద్రబాబు, ఎ.వెంకటేష్, ఎ.దేవేంద్ర, పి.మల్లికార్జున, డ్రైవరు చరణ్ పాల్గొన్నారు.

భార్య హత్య కేసులో భర్త అరెస్టు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

భార్యను అతి కిరాతకంగా నరికి చంపిన కేసులో నిందితుడైన భర్తను గురువారం ముదివేడు పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు మదనపల్లె సిఐ కార్యాలయంలో నిందితున్ని డిఎస్‌పి, సిఐ, ఎస్ఐ అరెస్టు చూపించారు. కేసుకు సంబంధించి డిఎస్‌పి మాట్లాడుతూ కురబలకోట మండలం పిచ్చలవాండ్లపల్లి పంచాయతీ మేకలవారిపల్లెకు చెందిన లక్ష్మీరెడ్డి(47) తన భార్య రమణమ్మను ఈ నెల 21వ తేదీ రాత్రి కొడవలితో నరికి హత్య చేశాడు. విచారణలో భార్యపై అనుమానం, ఇంటి నందు గల నాలుగు కోళ్లు చనిపోయిన తనకు సమాచారం ఇవ్వక పోవడంతో గొడవ పడినట్లు తెలిపాడు. నిందితుడు లక్ష్మిరెడ్డికి చెడు వ్యసనాలు ఉండడంతో భార్యపై అనుమానం పెంచుకొని హత్య చేసినట్లు తేటతెల్లమైంది. ఈ మేరకు నిందితున్ని కడప క్రాస్ వద్ద అరెస్టు చేసి రిమాండ్ పంపినట్లు తెలిపారు. ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించిన ఎస్ఐ మల్లికార్జునరెడ్డిని, సిబ్బందిని అభినందించారు.


కేసు వివరాలను వెల్లడిస్తున్న డిఎస్‌పి ప్రసాద్‌రెడ్డి

తెగుళ్లతో తగ్గిన టమోటా దిగుబడి

రాబోయే రోజుల్లో ఉజి ఉపద్రవం - కూలీల కొరతతో రైతులకు భారం

ప్రజాశక్తి-రామసముద్రం

ఆరుగాలం శ్రమించి పండించిన పంటలు తెగుళ్ల భారిన పడి టమోటా రైతులు ఆశించినంత స్థాయిలో దిగుబడులు రాకపోవడంతో మార్కెట్ ధరలు అమాంతం పెరిగిపోయాయి. మండలంలో ప్రస్తుత వాతావరణ పరిస్థితులను తట్టుకుని మంచి దిగుబడులు సాధించడానికి మేలు రకం టమోటా సాగు చేపట్టారు. జూన్, జులై నెలల్లో మార్కెట్ ధరలు ఊపందుకుంటాయనే నమ్మకంతో లాభమో... నష్టమో...తగ్గేదేలేదంటూ రైతులు టమోటా సాగు రోజురోజుకు విస్తరింప చేయడానికి కృషి చేస్తున్నారు. స్థానిక ప్రాంతాల్లో రోజువారీ కూలీలు దొరకడం క్లిష్టంగా మారింది. చేసేది లేక రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లోని కర్ణాటక రాష్ట్రానికి చెందిన రోజువారీ కూలీలు ఆటోలలో తరలించి పనులు పూర్తి చేసుకుంటున్నారు. పనిని బట్టి డిమాండ్ పెంచుకుంటూ పోతున్నారు. ఉదయం 7 నుండి మధ్యాహ్నం 2 వరకు ఒక రకం వేతనం, ఉదయం 7 నుండి సాయంత్రం 5 వరకు మరో రకం వేతనం ఇస్తున్నారు. రైతాంగం ఉపాధి హామీ పథకం రైతు పనులకు అనుసంధానం చేసి రైతులకు మేలు చేయాలని కోరుతున్నారు.

గతంతో పోల్చుకుంటే దిగుబడి తగ్గింది. రైతులు మరికొంత అదనపు విస్తీర్ణంలో టమోటా పంటలు సాగు చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ప్రతి ఏటా మార్చి నెల నుండి మే నెల మధ్య కాలంలో ఎక్కువ మంది రైతులు టమోటా పంటలు వేయడానికి ముందుకొస్తున్నారు. చాలా మంది రైతులు గుడ్డికన్నా... మెల్ల మిన్న అన్నచందంగా లాభమో..నష్టమో జులై నెలలో టమోటాలు మార్కెట్‌కు తరలించేందుకు పూనుకున్నారు. జులై నెలలో ధరలు పెరుగుతాయనే ఆశాభావంతో అధిక విస్తీర్ణంలో పంటలు సాగు చేశారు. ప్రతి ఏటా మార్చి నెల నుండి జులై నెల మధ్య రెండు వేల ఎకరాలకు పైగా టమోటా సాగు చేస్తున్నారు. మిగిలిన సమయాల్లో వాతావరణం అనుకూలతకు తగ్గట్టుగా కొంతమేర సాగు తగ్గించుకుని ఇతర ఉద్యాన పంటలు సాగు చేస్తున్నారు. ఎన్నో ఆటుపోట్లను తట్టుకుని పండించిన పంటలు నేడో రేపో గిట్టుబాటు ధరలు దక్కువచ్చుననే నమ్మకంతో నిరంతర ప్రక్రియగా టమోటా సాగు చేస్తే నాటి నుండి నేటి వరకు తెగుళ్ల రూపంలో టమోటా రైతులకు నిరాశే ఎదురైంది. పంటలు పండించే అన్నదాతకు దిక్కుతోచని పరిస్థితి ఎదురైంది.

తెగుళ్ల దాడిలో 35 శాతం నష్టం

కొంతకాలంగా టమోటా పంటలకు వైరస్ బెడద రెట్టింపు అవుతున్నది. పడమటి మండలాల్లో సాగుచేసిన టమోటా పంటలు ఎక్కువగా దెబ్బతింటున్నాయి. వైరస్ దెబ్బతో మొక్కలకు ముడతలు వచ్చి మొక్క ఎదుగుదల లేకుండా పోయింది. ఇప్పటికే 35 శాతం పంటను రైతులు నష్టపోయారు.


సాగులో ఉన్న టమోటా పంట

రాబోయే రోజుల్లో ఉజి ఉపద్రవం

ప్రస్తుతం మామిడి తోటలు ఉండటంతో ఉజి దెబ్బ ఇప్పటి వరకు టమోటా పంటకు నష్టం వాటిల్లలేదు. మామిడి పంట పూర్తయిన తరవాత ఉజి రూపంలో పంట నాశనం కానుంది. సీజన్ ఆరంభం నుంచి చివరి వరకు మండల పరిధిలో టమోటా సాగుకు రైతులు రూ.60 కోట్లకుపైగా ఖర్చు చేయనున్నట్లు సమాచారం. ఆసియా ఖండంలోనే అతిపెద్ద టమోటా మార్కెట్‌గా పేరొందిన మదనపల్లె మార్కెట్‌లో ప్రయివేటు రకానికి చెందిన పంట అధికంగా వస్తుంటుంది. బాహు రకానికి చెందిన టమోటా ఏప్రిల్, మే, జూన్ నెలలో అధిక ఉష్ణోగ్రతలు తట్టుకుని మంచిరంగు, రుచి, నాణ్యత కలిగి ఉంటుంది. మంచి ధర పలుకుతుంది. నియోజకవర్గంలోని రామసముద్రం, నిమ్మనపల్లి మండలాల నుండి ఎక్కువగా ఓ ప్రయివేటు కంపెనీకి చెందిన బాహు రకం టమోటా వేసవికాలంలో అధిక ఉష్ణోగ్రతలు తట్టుకుని మంచి దిగుబడులు ఇస్తుండటంతో ఎక్కువ మంది రైతులు ప్రయివేటు రకానికి చెందిన టమోటా పండిస్తున్నారు.

బిసిజి టీకాతో క్షయకు అడ్డుకట్ట


టీకా కార్యక్రమాన్ని తనిఖీ చేస్తున్న డాక్టర్ కిషోర్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి- కలకడ

బిసిజి టీకాతో క్షయ వ్యాధికి అడ్డుకట్ట వేయవచ్చని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కిషోర్ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని ఎర్రకోటపల్లి పిహెచ్‌సి పరిధిలోని కదిరాయచెరువులోని వడ్డిపల్లి దిగువపాలెం, ఎగువ కుర్రపల్లి కె.దొడ్డిపల్లిలోని గోపాలపురం ముడియం వారిపల్లిలోని ఇ.గొల్లపల్లి దేవాలపల్లి బొజ్జుగుంటపల్లిలోని వడ్డిపల్లి నిర్వహిస్తున్న వయోజన బిసిజి టీకా కార్యక్రమాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షయ (టిబి)వ్యాధి లేని భారతదేశం యొక్క లక్ష్య సాధన కొరకే వయోజన బిసిజి టీకాలు భారత ప్రభుత్వం ప్రవేశపెట్టినదని పేర్కొన్నారు. ప్రజలకు వయోజన బిసిజి టీకాపై ఎంపిహెచ్ఇఒ జయరామయ్య అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో టిబి రాకుండా ముందస్తు నివారణ చర్యల్లో భాగంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన వయోజన బిసిజి టీకా టిబి మరణాల తీవ్రతను నివారించడంలో జిసిజి టీకా చాలా సురక్షితమైనదని పేర్కొన్నారు. క్షయకు వ్యతిరేకంగా రోగనిరోధక శక్తిని మరింత పెంచడానికి, పెద్దలలో టిబి నుండి రక్షణ ఇవ్వడానికి ఈ కార్యక్రమం ఎంతో ప్రయోజన కారి అని తెలిపారు. ఎవరూ ఎలాంటి అనుమానాలకు తావు లేకుండా వేసుకోవచ్చునని చెప్పారు. 60 సంవత్సరాలు పైబడ్డ వయస్కులు, పొగ పీల్చువారు, మధుమేహ వ్యాధిగ్రస్తులు, టిబి జబ్బుతో కోలుకున్న వారు, వారి కుటుంబ సభ్యులకు, వీరు టీకాకు అర్హులన్నారు. రోజువారీ పనికి ఆటంకం, అసౌకర్యం గాని వుండదని తెలిపారు. ప్రభుత్వం అన్ని సాధారణ వైద్య సేవల్లో, ఆరోగ్య సంరక్షణకు చాలా మంచి కార్యక్రమమన్నారు. లబ్ధిదారులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఎర్రకోటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి 7751 మంది లక్ష్యం కాగా ఇప్పటివరకు 1351 మందికి అడల్ట్ బిసిజి టీకాలు ఇచ్చినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు వెంకటేస్వరరావు, పిహెచ్ఎన్ సుబ్బరత్న, ఎఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పిలు, ఆశ కార్యకర్త, ప్రజలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఖాద్రి ప్రసన్నలక్ష్మికి బంగారు పతకం

ప్రజాశక్తి-పీలేరు

2022-23 విద్యా సంవత్సరానికి 10వ తరగతిలో అత్యున్నత మార్కులు సాధించిన మెరిట్ విద్యార్థినిగా ఖాద్రి ప్రసన్నలక్ష్మి స్వర్ణ కమలం అందుకుంది. పీలేరులో 1964లో ప్రారంభమైన జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలకు ఆర్.పద్మావతమ్మ ప్రప్రథమ ప్రధానోపాధ్యాయినిగా నియమితులై 24 ఏళ్ల పాటు పనిచేసి పాఠశాల అభివృద్ధికి కృషి చేశారు. ఉద్యోగ విరమణ చేసినప్పటికీ తాను పనిచేసిన పాఠశాలలో ప్రతి సంవత్సరం 10వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో అత్యున్నత మార్కులు సాధించే విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్నారు. ఈ ఏడాది పబ్లిక్ పరీక్షల్లో ప్రథమ స్థానంలో నిలిచిన ఖాద్రి ప్రసన్నలక్ష్మికి విశ్రాంత ప్రధానోపాధ్యాయులు పద్మావతమ్మ తన సొంత నిధులతో గురు వారం పాఠశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ప్రస్తుత ప్రధానోపాధ్యా యులు ఫౌజియా బేగం చేతుల మీదుగా బంగారు పతకం అందించారు. ఖాద్రి ప్రసన్నలక్ష్మి ఒకటవ తరగతి నుంచి కూడా ప్రభుత్వ పాఠశాలాల్లోనే చదివింది. స్థానిక ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల నుంచి 2022-23 విద్యా సంవత్సరంలో జరిగిన 10వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో అత్యధిక మార్కులతో మొదటి స్థానం సాధించింది. ఈ విద్యార్థిని తండ్రి ఆర్.శ్రీకాంత్ విద్యుత్ శాఖలో జూనియర్ సహాయకులుగా, తల్లి ఎస్.మాధవి గృహిణిగా పని చేస్తున్నారు. ఖాద్రి ప్రసన్న లక్ష్మి ఇంటర్ ఎంపిసి గ్రూప్ మొదటి సంవత్సరంలోనూ 470/444 మార్కులు సాధించి తన ప్రతిభను చాటుకుంది. ఈ సందర్భంగా విద్యార్థిని తల్లిదండ్రులు మాట్లాడుతూ తమ కుమార్తె ప్రతిభను గుర్తించి ప్రోత్సహించిన విశ్రాంత ప్రధానోపాధ్యాయిని ఆర్.పద్మావతమ్మకు, ప్రస్తుత పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఫౌజియా బేగం కు, పాఠశాల బోధనా సిబ్బందికి కృతజ్ఞతలు తెలుపుకున్నారు. కార్యక్రమంలో విద్యార్థిని తల్లిదండ్రులు, పాఠశాల బోధన, బోధినేతర సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.


మెరిట్ విద్యార్థినికి బంగారు పతకం బహుకరిస్తున్న హెచ్‌ఎం ఫౌజియా బేగం

రైతాంగ సమస్యలను పరిష్కరించండి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

రైతాంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గురువారం సిపిఐ నాయకులు తహశీల్దారుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ఇన్‌ఛార్జి తోపు కృష్ణప్ప మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన రూ.20 వేలు సాగు సాయం ఈ ఖరీఫ్ సీజన్లోనే అందించాలన్నారు. పెరిగిన ఉత్పత్తి ఖర్చులకు అనుగుణంగా స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ నుంచి పంట రుణాలను వడ్డీ లేకుండా రూ.3 లక్షల వరకు, పావలా వడ్డీతో రూ. 5లక్షలు ఇవ్వాలన్నారు. అదేవిధంగా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చి రుణాలు అందించాలని కోరారు. రాష్ట్రంలో ప్రాజెక్ట్ కింద ఉన్న ప్రధాన కాలువలు, మేజర్, మైనర్ కాలువలతో పాటు డెల్టా ప్రాంతాల్లో మురుగునీటి కాలువల మరమ్మతులను వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ హయాంలో స్వీకరించిన ధాన్యం బకాయిలను రైతాంగానికి వెంటనే చెల్లించాలని తెలిపారు. నూతనంగా ఖరీఫ్ సాగుకు అవసరమైన పచ్చిరొట్టు విత్తనాలు, వరి, వేరుశనగ, కంది తదితర విత్తనాలను 90 శాతం సబ్సిడీపై రైతాంగానికి అందించాలని కోరారు. వ్యవసాయానికి అవసరమైన వ్యవసాయ పనిముట్లకు 90 శాతం సబ్సిడీతో రైతాంగానికి పంపిణీ చేయాలి. కల్తీ విత్తనాలను అరికట్టి కల్తీ విత్తనాలు అమ్ముతున్న వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకునేలా చట్టంలో మార్పులు తేవాలి. గత సంవత్సరంలో రబీ కాలంలో కరువు వల్ల నష్టపోయిన రైతులకు నష్టపరిహారం వెంటనే చెల్లించాలి. పంటల బీమా నిధులు విడుదల చేయాలి. ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయ రంగానికి అనుసంధానం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.సాంబశివ, వ్యవసాయ కార్మిక సంఘం ఏరియా కార్యదర్శి జి.చంద్రశేఖర్, సిపిఐ నాయకులు తిరుమలరెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం ఏరియా అధ్యక్షులు మునికాటయ్య, రవి కుమారి, గౌరీ పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు : 'దాసిరిపల్లె'

ప్రజాశక్తి-పెద్దమండ్యం

అధికారులు సమన్వయంతో పని చేసి ప్రభుత్వం ప్రవేపెట్టిన వివిధ సంక్షేమ పథకాలుఅర్హులైన ప్రతి ఒక్కరికి అందేవిధంగా సూడాలని తంబళ్లపల్లె నియోజకవర్గం తెలుగుదేశం ఇన్‌ఛార్జి దాసిరిపల్లె జయ చంద్రారెడ్డి అధికారులకు సూచించారు. గురువారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్.డి.ఏ ప్రభుత్వం ఏర్పడిందని అన్నారు.రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూపర్ సిక్స్ పథకాల్లో మొట్టమొదటి సరిగా ఐదు పథకాలపై సంతకం చేసారన్నారు. రానున్న జులై నెలలో రూ.7 వేలు వృద్ధులకు, వికలాంగులకు, పెన్షన్లు పంపిణీ చేయాలని సచివాలయ అధికారులను కోరారు. గత వైసిపి ప్రభుత్వంలో రూ.వెయ్యి పెంచడానికి నాలుగేళ్లు పట్టిందని ఎద్దేవా చేశారు. అర్హత వుండి పెన్షన్ రాని వారిని గుర్తించి వారికి పెన్షన్ అందేలా చూడాలని సూచించారు. పెద్దమండ్యం మండలంలో ఇటీవల జరిగిన సర్వాత్రికా ఎన్నికల్లో, 10 పోలింగ్ కేంద్రాల్లో టిడిపి తరపున ఏజెంట్లు లేకుండ చేచి రింగింగ్‌కు పాల్పాడిన ఘనత వైసిపిదేనని అయితే నైతికంగా విజయం మనదేనన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ వెంకట్రామయ్య, తహశీల్దార్ లక్ష్మి నాయక్, ఇఒపిఆర్‌డి శ్రీధర్‌రావు, ఎంఇఒలు మనోహర్, రామకృష్ణ, ఎఒ సురేష్ బాబు నాయక్, ఆర్డబ్ల్యుఎస్ ఇంజినీర్ హరిప్రసాద్, ట్రాన్స్‌కో ఎఇ శంకర్ రెడ్డి, ఎపిఒ మురళి, హౌసింగ్ ఎఇ సందీప్, నియోజకవర్గం కో-ర్డినేటర్ మల్లికార్జున, సిద్దవరం ఎంపిటిసి రుక్మదరెడ్డి, టిడిపి నాయకులు విశ్వనాథ్‌రెడ్డి, చల్లపల్లి వేణుగోపాల్‌రెడ్డి, నాగేశ్వరరెడ్డి, గంగాధర్, మహేష్, కాలేషా, యుగంధర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, సిద్దవరం ప్రసాద్, నారాయణ రఘురామ్‌రెడ్డి, సాంబా, శేషాద్రి పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యం

ప్రజాశక్తి-పీలేరు : యోగా సాధనతో మనిషికి మానసిక, శారీరక ఆరోగ్యం లభిస్తుందని యోగా సాధకులు శ్రవణ్ కుమార్ తెలిపారు. తిరుపతి రామచంద్ర మిషన్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక జిల్లా పరిషత్ ప్రధాన ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఒక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే యోగ సాధన ద్వారా కలిగే ఉపయోగాలను తెలియజేశారు. క్రమం తప్పక యోగ చేయడం ద్వారా కొన్ని రకాల దీర్ఘకాలిక ఆరోగ్య, శారీరక సమస్యల నుంచి నివృత్తి పొందవచ్చన్నారు. విద్యార్థులు ప్రతిరోజు యోగ అభ్యసనం అలవర్చుకుంటే వారిలో ఏకాగ్రత వృద్ధి చెంది చురుగ్గా ఉంటారని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సురేంద్రరెడ్డి, ఉపాధ్యాయులు ప్యారు ఖాన్, పోతంశెట్టి రమేష్, శ్రీరాములు, రఫీ పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

ప్రజాశక్తి- గాలివీడు : పేకాట స్థావరంపై గాలివీడు పోలీసులు బుధవారం రాత్రి దాడి చేశారు. ఇందులో ఏడుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ. 8200 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వెంకటప్రసాద్ పేర్కొన్నారు. వాహనాలు తనిఖీలో భాగంగా గాలివీడు పంచాయతీ దానంరెడ్డి గారి పల్లికి వెళ్లగా అక్కడ పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో వెంటనే దాడి చేసి వారిని అదుపులో తీసుకున్నామని చెప్పారు. ఇటువంటి కార్యక్రమాలు ఎక్కడైనా జరుగుతున్నట్లు సమాచారం వస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


విద్యార్థులకు జ్ఞాపిక, నగదు బహుమతిని అందిస్తున్న సంస్థ ప్రతినిధులు

విద్యార్థులను ప్రోత్సహించడమే 'మానవత' లక్ష్యం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ప్రతిభగల విద్యార్థిని, విద్యార్థులను ప్రోత్సహించడమే మానవత స్వచ్ఛంద సేవా సంస్థ లక్ష్యమని విజన్స్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు పోతుగుంట రమేష్ నాయుడు అన్నారు. గురువారం రాజంపేటలోని ఆకేపాడు ఉన్నత పాఠశాల, మందపల్లిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి ఉత్తీర్ణులై అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థిని, విద్యార్థులకు మానవత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు షేక్ అబ్దుల్లా ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రశంసా పత్రం, జ్ఞాపికతో పాటు నగదు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన విజన్ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు పోతుగుంట రమేష్ నాయుడు మాట్లాడుతూ మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ప్రజలకు అనేక రకాల సేవలు అందిస్తున్నటువంటి సంస్థ అని పేర్కొన్నారు. ముఖ్యంగా మరణించిన వారికి బాడీ ఫ్రీజర్లు ఉచితంగా ఇవ్వడమే కాకుండా వైకుంఠ రథం ద్వారా రాజంపేట చుట్టుపక్కల ప్రజలకు సేవలందిస్తున్నారని కొనియాడారు. పిల్లల్లో నైపుణ్యం, నైతిక విలువలు పెంపొందించడానికి ప్రభుత్వ పాఠశాలల్లో అనేక రకాల సెమినార్లు నిర్వహించడంతోపాటు ప్రతిభ గల విద్యార్థులను ప్రోత్సహించాలనే లక్ష్యంతో రాజంపేట పట్టణం, మండలంలో ఉన్న అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 10వ తరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థిని, విద్యార్థులను ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ సభ్యులు వేణుగోపాల్ నాయుడు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వసతి గృహాల్లో వార్డెన్ల బస ఎప్పుడో?

ప్రజాశక్తి గాలివీడు

మండలంలో సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాలు, బిసి వసతి గృహాలున్నాయి. వాటి నిర్వహణపై అధికారుల పర్యవేక్షణ కరువైందనే చెప్పవచ్చు. హాస్టళ్లల్లో వార్డెన్లు లేకపోవడంతో సౌకర్యాలపై ఆరా తీసేవారే కరవయ్యారు. రాత్రుళ్లు పిల్లలకు అక్కడ పని చేసే వంట మనిషి, ఆయా, వాచ్‌మెన్ తప్ప ఎవరూ ఉండరు. వార్డెన్ పోస్టు ఖాళీ కావడంతో ఇన్‌ఛార్జీలే నిర్వహిస్తున్నారు. పూర్తి బాధ్యతలు నిర్వహించే వారు లేకపోవడంతో రాత్రుళ్లు బస చేసిన దాఖలాలు లేవు. గతంలో కడప జిల్లా కలెక్టర్‌గా కోన శశిధర్ పనిచేసే రోజులలో నెలకు ఒక రోజు శుక్రవారం వసతి గృహాలలో కలెక్టర్ బస చేసేవారు. ఐఎఎస్, ఐపిఎస్ అధికారులు పల్లె నిద్ర నిర్వహించి హాస్టళ్లల్లోని సమస్యలను తెలుసుకుని పరిష్కరించేవారు. ప్రస్తుతం హాస్టల్ వార్డెన్ బసచేయడమే గగనమవుతోంది. వారు ఇంటి వద్ద ఉంటూ హాస్టల్‌ను విస్మరిస్తున్నారనే విమర్శలు విన్పిస్తున్నాయి. హాస్టళ్లలోని పిల్లలకు వంట మనుషులు అన్ని తానై చూసుకుంటున్నారు. పిల్లలకు కడుపు నిండా భోజనం పెట్టలేదనే ఆరోపణలున్నాయి. పదిమంది పిల్లలుంటే 100 మంది పిల్లలకు మెను తయారు చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. వీరిపై అధికారులు దృష్టి పెట్టి సాంఘిక విషయం వసతి గృహాలలో ఉన్న విద్యార్థులు కడుపునిండా మెనూ అందేలా చూడాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఆరోగ్య శాఖ మంత్రిని కలిసిన గోల్డెన్ వ్యాలీ రమణారెడ్డి


ప్రజాశక్తి-మదనపల్లి

ఆంధ్ర రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్‌ను గోల్డెన్ వ్యాలీ విద్యా సంస్థల అధినేత ఎన్.వి.రమణారెడ్డి, ఇంటర్నేషనల్ ఫిషర్స్ ఎక్స్పర్ట్, నేషనల్ ఓషన్ ఇనిస్టిట్యూట్ మెంబర్ డాక్టర్ నరేష్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన సత్యకుమార్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. శాలువాతో సత్కరించారు. అనంతరం ఆంధ్ర రాష్ట్ర ఆదాయ వనరుల ఆదాయాన్ని పెంచుకునే సమీక్ష సమావేశంలో మంత్రితో కలిసి పాల్గొన్నారు. ఆంధ్ర రాష్ట్రంలో సముద్ర తీర ప్రాంతం ఉన్నందున భారతదేశంలో ఆంధ్ర రాష్ట్రానికి ఉన్నతమైన స్థానాన్ని తీసుకురావడానికి అద్భుతమైన అవకాశం ఉందని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటే ఆదాయ వనరులు పెరుగుతాయి. దీని ద్వారా రాష్ట్రానికి, దేశానికి ఆదాయ వనరులు పెరిగి ఎంతో అభివృద్ధి చెందే అవకాశం ఉందన్నారు.మంత్రితో పలు విషయాలపై విశ్లేషించారు. సలహాలు, సూచనలను మంత్రి అభినందించినట్లు వారు తెలిపారు. ఈ విషయాలపై లోతుగా చర్చించి ఆంధ్ర రాష్ట్రానికి ఉపయోగపడే విధంగా అధికారులతో కలిసి చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చినట్లు తెలిపారు. వైద్య ఆరోగ్యశాఖ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలకు మంచి జరిగేలా అధికారుల ద్వారా చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపినట్లు ఎన్.వి.రమణారెడ్డి, డాక్టర్ నరేశులు తెలిపారు.. పుష్పగుచ్ఛాలు, శాలువాలు, కొనడం ద్వారా డబ్బులు వృథా అవుతాయని, విద్యార్థులకు, నోట్ పుస్తకాలు బ్యాగ్స్ తీసుకువస్తే వారికి ఎంతగానో ఉపయోగపడతాయని మంత్రి సూచించారు.


ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌తో మాట్లాడుతున్న రమణారెడ్డి

ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024

ఎంట్రీలకు ఆహ్వానం



ప్రియమైన మిత్రులారా!

ప్రజాశక్తి దిన పత్రిక వ్యవస్థాపక సంపాదకులు మోటూరు హనుమంతరావు స్మృత్యర్థం పాత్రికేయ రంగంలో ఉత్తమ కృషి చేసిన జర్నలిస్టులను సత్కరించేందుకు ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డును నెలకొల్పి రెండు దశాబ్దాలు దాటింది. కోవిడ్ కాలం మినహా ప్రతి యేటా క్రమం తప్పకుండా ఈ పురస్కారాన్ని ప్రజాశక్తి సాహితీ సంస్థ అందజేస్తూ వస్తున్నది. 2024 సంవత్సరానికి ఉత్తమ జర్నలిస్టు అవార్డు కోసం ఎంట్రీలను ఆహ్వానిస్తున్నది. సీనియర్ పాత్రికేయులు తెలకపల్లి రవి అధ్యక్షతన నాగార్జున యూనివర్సిటీ జర్నలిజం విభాగం అధిపతి ప్రొఫెసర్ జి అనిత, సీనియర్ జర్నలిస్టు నల్లి ధర్మారావుతో కూడిన త్రిసభ్య కమిటీ ఈ ఏడాది అవార్డు కోసం ఏదేని అంశంపై మానవాసక్తికర వార్తా కథనాలను ఎంట్రీలుగా ఆహ్వానించాలని నిర్ణయించింది. 2023 మే 1నుంచి 2024 జూన్ 18వ తేదీ వరకు తెలుగు దిన పత్రికల్లో ప్రచురితమైన మానవాసక్తికర కథనాలను మాత్రమే పంపాలి. ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన జర్నలిస్టులు ఎంట్రీలు పంపవచ్చు. ఎంట్రీతోపాటు ఇది నా సొంత రచన, ఎవరినీ అనుకరించినది కాదు అని స్వీయ ధ్రువీకరణ పత్రం జతచేసి పంపాలి. ఒక వ్యక్తి రెండు కథనాలకు మించి పంపకూడదు. తమ దృష్టికి వచ్చిన ఇతరుల కథనాలను ఎవరైనా సూచించవచ్చు కూడా. ప్రజాశక్తి సంస్థ జర్నలిస్టులు ఈ విభాగంలో పంపనవసరం లేదు. ఎంట్రీలు 2024 జులై 18 నాటికల్లా మాకు అందేట్లు చూడాలి. కవర్‌పై 'ఎం హెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024 కోసం' అని స్పష్టంగా పేర్కొనాలి. ఇ-మెయిల్ ద్వారా కూడా పంపవచ్చు. అవార్డు విజేతకు 2024 ఆగస్టులో జరిగే ఎంహెచ్ స్మారకోపన్యాస సభలో జ్ఞాపిక, రూ.10 వేలు నగదు ఇచ్చి సముచిత రీతిలో సత్కరించడం జరుగుతుంది.

ఎంట్రీలు పంపాల్సిన చిరునామా

ప్రజాశక్తి సాహితీ సంస్థ,
ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ,
తాడేపల్లి, గుంటూరు జిల్లా,
పిన్‌కోడ్-522501, ఇ మెయిల్
అడ్రస్: psmhaward@gmail.com

కార్యదర్శి

(ఎంవిఎస్ శర్మ)
ప్రజాశక్తి సాహితీ సంస్థ

